క్లుప్తంగా

రామాలయంలో దీపారాధన



రామాలయంలో స్వామివారికి దీపారాధన

బలిజిపేట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బలిజిపేటలోని గొల్లవీధి రామాలయంలో 19వ పాసురం (కుర్తు వెలక్కరై)వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి దీపారాధనతో పూజలు చేశారు. ధర్మకర్త అంగజాల లక్ష్మణరావు, కుటుంబీకులు, భక్తులు దీపాలను వెలిగించి పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ధనుర్మాస రోజులలో దీపాలంకరణ ఎంతో పవిత్రమైనదని అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరం



గ్రామసభలో మాట్లాడుతున్న కార్యదర్శి పాపారావు

గరుగుబిల్లి: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు అవసరమని పంచాయతీ కార్యదర్శి పాపారావు అన్నారు. మండలంలోని శివ్వాంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను ముందుస్తుగా తయారుచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.పోలమ్మ, వైస్ సర్పంచ్ జి.శంకరరావు, నాయుకులు పి.పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు. గ్రామసభలకు ప్రజల భాగస్వామ్యం లేకుండా కేవలం అధికారులతో నిర్వహిస్తే ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయని వైస్ సర్పంచ్ శంకరరావు ఆరోపించారు. గ్రామసభలలో ప్రజలు పాల్గొనేలా చూడాలని ఆయన అధికారులకు కోరారు.

ప్రైవేటు వ్యాపారులను నియంత్రించాలని వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకొండ: ధాన్యం కొనుగోలులో ప్రైవేటు వ్యక్తులను నియంత్రించాలని రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు మంగళవారం సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను కలిసి రైతు సమస్యలను వివరించారు. ప్రైవేటు వ్యక్తులు రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. నేరుగా రైతు భరోసా కేంద్రాల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని విన్నవించారు.

గ్రామాభివృద్ధికి అందరి సహకారం అవసరం



కొప్పర దివ్యను అభినందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, గ్రామస్తులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, గవరమ్మపేట సచివాలయాల్లో సర్పంచుల ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా గ్రామసభ దృష్టికి తీసుకురావాలని కోరారు. బిత్రపాడు గ్రామానికి చెందిన కొప్పర దివ్య స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో పాల్గొని పతకం సాధించడంతో ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

10 రకాల సరుకులు సరఫరా చేయాలి

సీతంపేట: రేషన్ డిపోల ద్వారా 10 రకాల నిత్యావసర సరుకులను సరఫరా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆరిక భాస్కరరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆ పార్టీ మండల స్థాయి జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు సబ్సిడీపై అందిస్తున్న సరుకులను వెంటనే అందజేయాలన్నారు. ప్రస్తుతం బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదని, బియ్యంతో పాటు పది రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురం టౌన్: అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం మండలంలోని అడారు పంచాయతీ గుడారువలస, గెదగుమ్మివలస గ్రామాలలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే జోగారావు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలు, అక్కా చెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. పింఛన్లు ప్రతి నెలా 1వ తేదీన ఉదయం 5గంటలకే వలంటీరు తలుపుతట్టి ఇస్తున్నారని వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా పలు సంక్షేమ పథకాలతోపాటు సుమారు 98 శాతం హామీలను నెరవేర్చారని చెప్పారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి మళ్లీ పరిశీలించి మంజూరు చేసినట్లు చెప్పారు. సచివాలయాలు ఆయా గ్రామాల పరిధిలో ఉండడంవల్ల ప్రజలు కూడా వారి సమస్యలను వెంటనే తెలియజేసి పరిష్కారం పొందుతున్నారని తెలిపారు.

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి

రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సచివాలయానికి రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యశ్రీ, వైస్‌ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతిరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జక్కు ప్రవీణ్, జి.శంకరరావు, ఎస్.శ్రీరాములు, శ్రీరంజన్, వై.వెంకటరమణ, ఎస్.శ్రీరాములునాయుడు, ఎం.సత్యంనాయుడు, బి.నాగేశ్వరరావు, బి.కృష్ణమూర్తి, వెంపలి గుర్రాజు, ఎం.విశ్వనాథం, బి.రామకృష్ణ, వై.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమగ్రాభివృద్ధే ప్రధాన ఎజెండా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: గ్రామ సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పెదబొండపల్లి మేజర్ పంచాయతీలోని గ్రామ సచివాలయం ఆవరణలో సర్పంచ్ సవరాపు తవుడమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బందికి గ్రామాభివృద్ధి, ప్రణాళికా అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించామని చెప్పారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూసే బాధ్యత ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందిపైనే ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం వైస్ ఎంపీపీ సిద్ధా జగన్నాథరావు, పీఏసీఎస్ చైర్మన్ జి.దామోదర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సవరాపు రాజారావు, చందాన శివాజీ కుమార్, యండ్రాపు శ్రీరామ్, వంగపండు కృష్ణమూర్తి, బి.సింహాచలం, స్కూల్ కమిటీ చైర్మన్ పప్పల శ్రీనివాసరావు, వి. గురురాజు, జె.చిన్నంనాయుడు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభ ప్రణాళిక ఆధారంగా అభివృద్ధి పనులు

- జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్ కుమార్



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం అశోక్‌కుమార్

సీతానగరం: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి పథకంలో భాగంగా నిర్వహించిన సభల్లో తయారు చేసిన ప్రణాళికలను 'ఈ' గ్రామ స్వరాజ్ పోర్టల్ యాప్‌లో అప్‌లోడ్ చేసి నివేదిక పంపిస్తామని జెడ్పీ సీఈఓ డాక్టర్ ఎం.అశోక్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీతానగరం మండల పరిషత్ కార్యాలయానికి ఏన్యువల్ రికార్డుల తనిఖీ నిమిత్తం వచ్చారు. రికార్డుల తనిఖీ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 42 మండల కేంద్రాల్లో డిసెంబరు నెలాఖరు నాటికి గ్రామ సభలు నిర్వహించడం పూర్తయినట్లు తెలియజేశారు. ప్రస్తుతం గ్రామాల్లో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాల్లో ఒక్కో కుటుంబం నుంచి ఒకొక్కరు వంతున గ్రామసభలో భాగస్వాములను చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన జగనన్న కాలనీల్లో పట్టాపొందిన లబ్ధిదారులంతా సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఇళ్లను నిర్మించుకోవాలని కోరారు. ప్రభుత్వం లక్షలాది రూపాయల విలువైన స్థలం సమకూర్చి ఇంటి నిర్మాణానికి రాయితీపై ముడిసరుకు సమకూర్చినట్లు చెప్పారు. ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షల సాయం అందిస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు విధించిన టార్గెట్ పూర్తి చేయడానికి స్వల్ప వడ్డీపై వెలుగు ద్వారా రూ.35 వేలు సమకూర్చిందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఎటువంటి విపత్తులు వచ్చినా సేవలందించడానికి చదువరులైన ఆశవర్కర్లు, గ్రామవలంటీర్ల నుంచి ఆపద మిత్రలను నియమించి వారికి 15 రోజులు శిక్షణ,సర్టిఫికెట్‌లు ఇచ్చినట్లు చెప్పారు. ఆపద మిత్రలు ఎటువంటి విపత్తులు వచ్చినా సేవలందించడానికి పార్వతీపురం మన్యం జిల్లానుంచి 150 మంది, విజయనగరం జిల్లానుంచి 200 మందిని సిద్ధం చేశామన్నారు.

జిల్లాలో వారంలో రెండు రోజులు

కలెక్టర్ నిషాంత్ కుమార్ సూచనల మేరకు పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ప్రతి మంగళవారం, శుక్రవారం ప్రజలకు అందుబాటులో ఉంటానని మిగతా రోజుల్లో విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి కృష్ణమహేష్ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయం మేరకే గ్రామాల్లో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న సర్పంచ్ తిరుపతిరావు

సీతానగరం: ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తయారుచేసిన ప్రణాళికల ఆధారంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని గ్రామసభల ప్రత్యేక అధికారి(ఎన్ఆర్ఈజీఎస్-ఈసీ) కృష్ణ అన్నారు. ఈ మేరకు మంగళవారం గెడ్డలుప్పిలో సర్పంచ్ అల్లు తిరుపతిరావు అధ్యక్షతన గ్రామాభివృద్ధి ప్రణాళికల తయారు అంశంపై రామమందిరంలో కార్యదర్శి సీహెచ్ మోహనరావు గ్రామసభ నిర్వహించారు. ఈ మేరకు ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రణాళికలు తయారుచేసి ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తుందని చెప్పారు. సర్పంచ్ అల్లు తిరుపతిరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గ్రామంలో సామాజిక పరమైన అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా చేపట్టవలసిన అభివృద్ధి పనులకు ప్రజల అభిప్రాయాలను సేకరించి ప్రణాళికలు తయారుచేసిన అనంతరం దశలవారీగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను శాఖలవారీగా సచివాలయ ఉద్యోగులు ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏకగ్రీవం



మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గంతో ఈఓపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక మంగళవారం ఏకగ్రీవమైంది. పెదభోగిలి పంచాయతీ ఈఓ జి.వెంకటరావు (గౌరవ అధ్యక్షుడు) ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడిగా పెంట తిరుపతిరావు(నిడగల్లు) ప్రధాన కార్యదర్శిగా ఫీటరు (చెల్లన్నాయుడువలస)ఉపాధ్యక్షురాలిగా గౌతమి(కొత్తవలస), సంయుక్త కార్యదర్శిగా జి. శ్రీనివాసరావు(కృష్ణారాయపురం),కోశాధికారిగా బి మనోహర్ (చినభోగిలి) ఎన్నికైనట్లు వెంకటరావు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఫీటర్‌లు మాట్లాడుతూ సభ్యులంతా సమన్వయంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. తమపై ఉంచిన గురుతరమైన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తామన్నారు. సంఘం సభ్యులంతా సమన్వయంతో పని చేసినప్పుడే సమస్యలు పరిష్కరించడానికి దోహద పడతాయన్నారు. అనంతరం మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక పత్రాన్ని ఈఓపీఆర్డీ కె కుమారవర్మకు అందజేశారు. నూతన ఎన్నికైన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు.

పది పరీక్షల్లో ఉత్తీర్ణతకు ఇష్టపడి చదవాలి



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈఓ ఎస్‌డీవీ రమణ

సీతానగరం: జిల్లాలో జరగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులు కష్టపడి చదవడం కన్నా ఇష్టపడి చదివితే శతశాతం ఉత్తీర్ణత సాధించడం కష్టమేమీ కాదని డీఈఓ ఎస్‌డీవీ రమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలంలోని ఆర్.వెంకంపేట, గాదెలవలస ఉన్నత పాఠశాలలు, కేఎస్‌పురం యూపీ స్కూలును అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు గాదెలవలస ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులను పాఠశాలలో జరుగుతున్న విద్యాబోధన అర్థమవుతున్నదీ? లేనిదీ? విద్యార్థుల్లో ఉన్న విద్యా సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన రుచులను పరిశీలించారు. అలాగే కేఎస్ పురంలో యూపీ స్కూల్‌లో ఉపాధ్యాయులు చేస్తున్న విద్యాబోధన పరిశీలించారు. గాదెలవలస ఉన్నత పాఠశాలలో జరుగుతున్న భవన నిర్మాణాలను, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఉత్తీర్ణతశాతాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చవడం మంచిది కాదని ఇష్టపడి చదివితే పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించవచ్చని అన్నారు. ఉత్తీర్ణతశాతాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

గిరిజన సమస్యల పరిష్కారం సీఎం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజన నియోజకవర్గాల్లో దశాబ్దాలుగా తిష్టవేసిన సమస్యల పరిష్కారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఏగులవాడ పంచాయతీ పరిధిలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని ఇప్పిలగుడ్డి, బొత్తిలి, సెంటర్‌గూడ, ఈతమానుగూడ, జొంగరపాడు, రజ్జిలి, పోరండంగూడ, మరిపల్లి గిరిజన గ్రామాల్లో ఎంపీటీసీ రాజేశ్వరి, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా వారికి అందించిన లబ్ధిని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చటం జరిగిందన్నారు. ఏజన్సీలో రహదారుల నిర్మాణం చురుగ్గా జరుగుతున్నాయని, ప్రతీ గిరిజనుడికి విద్య, వైద్యం, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తనకు తెలియచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్, కురుపాం జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, ఎంపీటీసీ విద్యారాణి, మాజీ జెడ్పీటీసీ, ఎంపీపీలు కోటేశ్వరరావు, ఆనిమి ఇందిరాకుమారి, మాజీ ఏఎంసీ చైర్మన్ నిమ్మల వెంకటరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు జిలానీ, ఆదిల్, సుబ్బు, ఆకుల శ్రీధర్, కిమిడి శేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, రేవు సత్తిబాబు, మధు, బిడ్డిక అనంత్ పాల్గొన్నారు.

నేడు గురువునాయుడుపేటలో 'గడప గడపకు..'

పాచిపెంట: మండలంలోని గురువునాయుడుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

9న వాహనాల వేలం

సాలూరు: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఎస్పీ ఆదేశాల మేరకు ఈ నెల 9న వేలం వేయనున్నట్లు రూరల్ ఎస్సై ప్రయోగామూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్రవాహనాలు 10, ఆటోలు 2, బొలేరో వాహనం ఒకటి వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు.

లోక్‌అదాలత్‌ను జయప్రదం చేయండి



లోక్‌అదాలత్ నిర్వహణపై పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న న్యాయమూర్తి ఆంజనేయులు

కురుపాం: వచ్చే నెల 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని స్థానిక ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి ఇ.ఆంజనేయులు కోరారు. స్థానిక కోర్టులో పోలీసు సిబ్బంది, న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కోర్టు పరిధిలో, పోలీసు స్టేషన్స్‌లో పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌ను వినియోగించుకునేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, కురుపాం, ఎల్విన్‌పేట, నీలకంఠాపురం ఎస్సైలు ప్రసాద్, షణ్ముఖరావు, అనీల్, కురుపాం ఏఎస్సై కె.నర్సింహులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

సీతంపేట: మండలంలోని జరడుకాలనీలో మంగళవారం ఉపాధిహామీ పనులు ప్రారంభమయ్యాయి. గత కొద్దినెలలుగా ఖరీఫ్ వ్యవసాయ పనులు జరగడంతో ఈ ప్రాంతంలో ఎన్ఆర్‌ఈజీఎస్ పనులు జరగలేదు. గత కొద్దిరోజులుగా ఎటువంటి పనులు లేకుండా ఎదురుచూస్తున్న వేతనదారులు ఉత్సాహంగా పనుల్లో పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ



విశాఖ ఆస్పత్రిలో రోగికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు చిన్నమ్మి



కేఎస్ పురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ వై.అరుణకుమారి

సీతానగరం: గ్రామాల్లో పింఛన్ల పంపిణీ జరుగుతుండడంతో పింఛన్‌దారుల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది. తాజాగా పెంచిన పింఛన్ల సొమ్ముతో పాటు కొత్తగా మంజూరుచేసిన పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయడంతో అన్నిగ్రామాల్లో పెంచిన పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు, కొత్తగా మంజూరైన వారి కళ్లలో సంతోషం కనిపిస్తోంది. పండగ వాతావరణం ముందుగానే వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కేఎస్ పురం గ్రామంలో ఎంపీటీసీ సభ్యురాలు వై.ఆరుణకుమారి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కామేశ్వరరావు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే పెదభోగిలి పంచాయతీ అప్పయ్యపేట గ్రామానికి చెందిన కె.పార్వతి అనారోగ్యానికి గురై విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గ్రామ వలంటీరు జి.చిన్నమ్మి వ్యయ ప్రయాసల కోర్చి విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి పార్వతికి పింఛన్ అందజేసింది. వలంటీర్ ద్వారా పింఛన్ అందచేసిన జగనన్నకు, వలంటీర్‌కు రుణపడి ఉంటామని పింఛన్‌దారు పార్వతి కృతజ్ఞతలు తెలియజేసింది.

పింఛన్లు సద్వినియోగం చేసుకోవాలి

పార్వతీపురంటౌన్: అర్హులైన పేదలకు పింఛన్లు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత లబ్ధిదారులపై ఉందని మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలోని 27వ వార్డులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా మంజూరైన పింఛన్లను పలువురికి అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుతం 2,750లకు పింఛన్ పెంచిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.



27వ వార్డులో దివ్యాంగురాలికి పింఛన్ అందిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ గున్నేశ్వరరావు

కిచెన్ గార్డెన్‌తో ఆహార ఖర్చు ఆదా..

గరుగుబిల్లి: కిచెన్ గార్డెన్లు(పెరటి తోటలు)తో కుటుంబానికి కూరగాయల కోసం అయ్యే ఖర్చు ఆదా అవుతుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని తోటపల్లిలో మార్కొండ పకీరునాయుడు ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న కిచెన్ గార్డెన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. కిచెన్ గార్డెన్ అవశ్యకత, ప్రకృతి సాగు విధానం వల్ల కలిగే ప్రయోజనాలు, అపరాల సాగులో మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కిషోర్, ఆనంద్, ఎస్‌డీఏ, అన్నపూర్ణ, ఉమ ఉన్నారు.



కిచెన్ గార్డెన్ అవశ్యకతను వివరిస్తున్న డీపీఎం షణ్ముఖరాజు

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

జియ్యమ్మవలస: వైఎస్సార్‌టీఎఫ్ వార్షిక క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆవిష్కరించారు. చినమేరంగిలోని వారి నివాసంలో మంగళవారం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీతన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల మాధవరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అభివృద్ధే లక్ష్యం



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

పాలకొండ రూరల్: క్షేత్రస్థాయి నుంచి అభివృద్ధి చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అన్నవరం పంచాయతీ సర్పంచ్ గవర రాజశేఖర్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ క్రమంలో ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాటిని పొందుతున్న లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించారు. ప్రజలు అందించిన గృహ సంబంధిత ఇతర ఫిర్యాదులపై సంబంధిత శాఖ అధికారుల తెలిపిన వివరణ అర్జీదారులకు తెలియజేశారు. వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్ మాట్లాడుతూ..అర్హత ఉన్నత ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి వర్తిస్తుందన్నారు. ఉపాధిహామీ ద్వారా శాశ్వత ప్రాతిపదికన ప్రయోజనాలు ఇచ్చే పనులు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించటంతో ప్రజల సహకారం అవసరమన్నారు. సభలో గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.